క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు వితరణ

ఏలేశ్వరం: శంఖవరం మండలం శృంగధారలోని ఎంపీపీ పాఠశాలకు మంగళవారం ఫ్యాన్లు, కుర్చీలు వితరణ చేశారు. బిక్కవోలుకు చెందిన కేపీకే క్రాప్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వీటిని పాఠశాలకు అందించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగ చాందిని, ఎస్ఎంసీ చైర్మన్ జలమూరి సీత, యూటీఎఫ్ నాయకురాలు గోపి స్వరాజ్యలక్ష్మి వీరికి కృతజ్ఞతలు తెలిపారు.

అభా కార్డుల అందజేత



ఏలేశ్వరంలో అభా కార్డులు పరిశీలిస్తున్న సంఘ సభ్యులు

ఏలేశ్వరం: నేషనల్ హెల్త్ అథారిటీ వారి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) కార్డులు రిటైర్డ్ ఉద్యోగులకు అందజేస్తున్నట్టు మండల పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు రామచంద్రరావు తెలిపారు. స్థానిక మండల పెన్షనర్స్ సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన సంఘ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.5 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ అభా కార్డుల ద్వారా లభిస్తుందన్నారు. కార్డుల పొందేవారు అధార్ కార్డు, ఫోన్ తీసుకుని సంఘ కార్యాలయానికి రావాలని కోరారు. కార్యాలయంలో సొంత ఖర్చులతో కార్డులు తయారు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జహీరుద్దీన్, పొన్నాడ జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: ఆషాఢమాసం ఏకాదశి పురస్కరించుకుని పట్టణంలో మహిళలు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పరిషత్ దుర్గావాహిని, మాతృశక్తి సంఘాల మహిళలు హనుమాన్ చాలీసా, భగవద్గీత, షణ్ముఖ అష్టకం, భక్తిపాటలు ఆలపించారు. అనంతరం స్వామి వారికి తమలపాకులు, సింధూర పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు ఆర్థిక సాయాన్ని అందించారు. మంగళవారం సాయంత్రం ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేలు, నెలకు సరిపడా నిత్యావసరాలు, దుస్తులు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు ఏపూరి సత్యనారాయణ, గొల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు

గండేపల్లి: తాళ్లూరులో ఉన్న వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

హైవేపై బొగ్గు లారీ బోల్తా



ప్రత్తిపాడు హైవేపై బోల్తా పడిన బొగ్గు లారీ

ప్రత్తిపాడు రూరల్: పట్టణ శివారు జాతీయ రహదారిపై బొగ్గు లారీ బోల్తా పడింది. తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న బొగ్గు లారీ మినర్వా విద్యాసంస్థల వద్ద ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రాచపల్లి అడ్డురోడ్డు వరకు అర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆర్థిక సాయం

జగ్గంపేట: మండలంలోని సీతానగరానికి చెందిన కురుకూరి బుల్లి అబ్బులుకు కరుటూరి ఛారిటబుల్ ట్రస్ట్, కాకినాడ లయన్స్ క్లబ్ తరఫున రూ.25 వేల నగదును మంగళవారం అందజేశారు. ఇటీవల లారీ ప్రమాదంలో కాలు కోల్పోయిన అబ్బులుకు తమ వంతుగా సాయం అందజేస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కరుటూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ర్యాలీ

గోకవరం: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో తమకు ఉపాధి కల్పించాలని గోకవరంలోని ఆటో కార్మికులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీజైభవాని పాసింజర్ ఆటో యూనియన్ కార్మికులు సుమారు 300 ఆటోలతో పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో ఉచిత బస్సు ఏర్పడిన తర్వాత ఆటో కార్మికుల కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉన్నాయని, ఆ విధంగా రాష్ట్రంలో ఉండకూడదన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మోతాదు మించితే.. ముప్పే!

- వరిలో ఎరువుల యాజమాన్యం కీలకం
- అవసరం మేరకు వినియోగిస్తే మంచి ఫలితాలు
- సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలంటున్న అధికారులు



అల్లిపూడిలో నారు తీస్తున్న మహిళా రైతు కూలీలు

కోటనందూరు: ఇటీవల సంభవించిన అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో మెట్టలో ఖరీఫ్ వరిసాగు జోరుగా సాగుతోంది. రైతులకు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని ఇచ్చే ఖరీఫ్ సాగులో ఎరువుల యాజమాన్యం కీలకం. భూసార పరీక్షల ఆధారంగా నేల పరిస్థితిని బట్టి ఎరువులను అవసరం మేరకు వినియోగిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. మితిమీరిన ఎరువుల వినియోగంతో ఆరోగ్యంతో పాటు, ఆశించిన దిగుబడులు కూడా కోల్పోయే ప్రమాదముంది. ప్రధాన, కాంప్లెక్స్ ఎరువుల వినియోగంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు వస్తాయి. రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకొని సాగులో పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న ఐదు మండలాల్లో 40 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేసే అవకాశం ఉంది. ఖరీఫ్ ప్రారంభంలో ఓ మోస్తరుగా కురిసిన వర్షాలకు రైతులు నారు మడులను సిద్ధం చేశారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు జోరుగా నాట్లు వేస్తున్నారు. తుని సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటికే 40 శాతం విస్తీర్ణంలో నాట్లు వేసినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ముందుగా నాట్లు వేసిన రైతులు ఒకపక్క పంట ఏపుగా ఎదగడానికి, మరోపక్క తెగుళ్లు, కలుపు నివారణకు ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరిసాగులో యూరియా, డీఏపీతో పాటు, పొటాష్‌ను తగిన మోతాదులో వినియోగించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ప్రధాన ఎరువుల వినియోగం

ఎకరం పొలానికి 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తరువాత నాలుగు కేజీల డీఏపీ, రెండు కేజీల యూరియా, కేజీ పొటాష్ కలిపి వేస్తే ఆకు వేపుగా ఎదుగుతుంది. అలాగే మొదటి దమ్ములో మూడు బస్తాల సూపర్, బస్తా డీఏపీ, ఊడుపు చేసే ముందు 35 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ కలిపి వాడాలి. పొలం ఊడిచిన 45 రోజుల తరువాత 45 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ వేసుకోవాలి. పొట్ట దశలో మరో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి వాడాలి. 60 రోజుల వ్యవధిలో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చొప్పున వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

పొటాష్ లోపంతో ప్రమాదం

సాధారణంగా రైతులు వరిసాగులో యూరియా డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాష్ వినియోగంపై ఆసక్తి చూపడం లేదు. పొటాష్ లోపం కారణంగా గింజ గుల్లబారి బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగులో పొటాష్ వినియోగంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. పొటాష్ వినియోగాన్ని పట్టించుకోకపోతే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవాలి

తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు ఇచ్చే సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మితిమీరిన రసాయనిక ఎరువుల వాడకంతో అనారోగ్య దిగుబడులతో పాటు నేల నిస్సారమైపోతుందని హెచ్చరిస్తున్నారు. కొద్దిగా కష్టమైనా తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెబుతున్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన అవసరం



వరి సాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. సమగ్ర ఎరువుల యాజమాన్యంతో ఖరీఫ్ సాగులో మంచి దిగుబడులు వస్తాయి. వ్యవసాయశాఖ సిబ్బంది సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సేంద్రియ ఎరువుల వైపు రైతులు అడుగులేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– కేజే చంద్రశేఖర్, ఏఈ, కోటనందూరు.

సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

తుని రూరల్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు వి.కొత్తూరులో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ప్రసన్నరాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న 59 సీట్లను రిజర్వేషన్ల వారీగా భర్తీ చేస్తామన్నారు. మొదట సంవత్సరం ఎంఈసీలో మొత్తం 24 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంఈసీలో 32 సీట్లు ఉన్నాయన్నారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ ఎస్సీ–1లో రెండు, బీసీలో–1 సీటు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు కళాశాలలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 97045 51118, 80740 79227 నంబర్లను సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి 24 సీట్లు, పదో తరగతి ప్రవేశానికి 9 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత సీట్లలో ప్రవేశానికి ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముద్రగడ ఆరోగ్యంగా ఉండాలని పూజలు



పాండవులపాలెంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని మండలంలోని పాండవులపాలెంలో సీతారామాంజనేయులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముద్రగడ త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలని వేడుకున్నారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని, గొట్టిపల్లి చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

ముదునూరి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో ఇటీవల ప్రమాదం బారిన పడిన దువ్వి కన్నబాబును వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు కలిసి ఆర్థిక సాయం అందించారు. మంగళవారం గ్రామంలో పర్యటించి కన్నబాబును పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి రూ.5 వేలు అందజేశారు. బాధితుడిని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు చొప్పా రాంబాబు, దడాల సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి



గండేపల్లిలో తహసీల్దార్‌కు వినతపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే సభ్యులు

గండేపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జర్నలిస్టులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం గండేపల్లి తహసీల్దార్ ఆర్ శ్రీనివాస్, జగ్గంపేట డీటీ నాగేశ్వరరావుకు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం వహిస్తుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా అక్రిడేషన్ల గడువును పొడిగిస్తూ కొత్తవి ఇవ్వట్లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ కార్డు పథకంలో ఉన్న లోటుపాట్లను సవరించి మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని, ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని కోరారు. ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛన్ పథకాన్ని ఏపీలో అమలు చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రత్తిపాడు: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పాత్రికేయులు ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బర్ల లోవరాజు మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు జారీ చేయడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కొత్త అక్రిడేషన్ కార్డులు మంజూరు కాకపోవడం వల్ల పాత్రికేయులు నష్టపోతున్నారని చెప్పారు. జర్నలిస్టులకు పెన్షన్, గృహ నిర్మాణం, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వం స్పందించాలి

గోకవరం: జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఏపీయూడబ్ల్యూజే గోకవరం మండల శాఖ అధ్యక్షుడు మద్దాల లక్ష్మణరావు అన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం మండల జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కులను వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

శంఖవరం: గ్రామీణ ప్రాంతంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న జర్నలిస్టుల పిల్లలకు రాయితీ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రేలంగి దొరబాబు, జక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి లేని చంద్రబాబు పాలన



పీఈ చిన్నాయపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న యనమల కృష్ణుడు

తొండంగి: చంద్రబాబు పాలన చరిత్రలో పేదల సంక్షేమంపై చిత్తశుద్ధి ఏమాత్రం లేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ×బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ౯ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు పాలనా చరిత్రలో ప్రజలను నమ్మించి మోసం చేయడం తప్ప పేదల సంక్షేమాభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా పర్యటించి జగన్ పాలనలో చేకూరిన లబ్ధి, చంద్రబాబు పాలనలో జరిగిన మోసాన్ని వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, పార్టీ కన్వీనర్ బత్తుల వీరబాబు, మండల యూత్ కన్వీనర్ పప్పల వెంకట్, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ మండల మహిళా ఉపాధ్యక్షురాలు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజం

తుని రూరల్: నమ్మిన ప్రజలను వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మంగళవారం తుని మండలం డి.పోలవరంలో జిల్లా కార్యదర్శి చింతల వెంకటరమణ, దొండవాకలో లంక సత్యనారాయణ, రాపాకలో నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటా పర్యటించి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు డొంక వెంకట బెనర్జీ, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవులు, నాయకులు చిటికెల వరహాలబాబు, తాతారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్టు సమితి సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ కల్లేపల్లి రాజేష్ జన్మదినం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఫ్రూట్స్ అందజేశారు. శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్ సంయుక్త సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట సుగుణారావు, మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు వేయడంపై అవగాహన

కోటనందూరు: పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఈఓలు జగ్గప్పారావు, సురేష్ మంగళవారం నిర్వహించారు. రైతు కూలీలకు వరినాట్లు వేయడంపై అవగాహన కల్పించారు. నారు మడుల్లో ఎరువులు, పురుగుమందుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. పొలం గట్లపై వేసుకునేందుకు కందులు, మినుముల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. పంట నమోదు, బీమా చేయించుకోవాలని సూచించారు.

రేపటి నుంచి పూర్తి వైద్య సేవలు

గండేపల్లి: మండలంలోని జెడ్ రాగంపేట శివారులో నూతనంగా నిర్మించిన సీహెచ్‌సీ ఆసుపత్రిలో గురువారం నుంచి పూర్తిస్థాయిలో వైద్య సేవలు ప్రారంభం కానున్నట్టు వైద్యాధికారి ప్రణీత్ తెలిపారు. జగ్గంపేట– గుర్రంపాలెం రోడ్డులోని ఈ ఆసుపత్రి సేవలను నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో జరుగుతాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

అవంతి ఫుడ్స్ కంపెనీలో తనిఖీలు

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లి సమీపంలోని అవంతి ఫుడ్స్ కంపెనీలో మంగళవారం నేషనల్ పొల్యూషన్, రాష్ట్ర పొల్యూషన్ కమిటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పెద్దనాపల్లి గ్రామానికి చెందిన చిన్ని అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో అధికారులు కంపెనీ, పోలవరం కాలువ, సమీపంలోని నీటిగుంటలను పరిశీలించారు. కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ నీరు పోలవరం కాలువలోకి చేరి కాలుష్యం అవుతుందని, కంపెనీ సమీపంలో ఉండటంతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఫిర్యాదు చేశాడు. దీంతో పెద్దాపురం ఆర్డీఓ రమణితో కలిసి అధికారులు తనిఖీలు నిర్వహించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



లింగంపర్తిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తుని రూరల్: పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలను తాగించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ శ్రీకళ అన్నారు. మంగళవారం సీడీపీఓ కె.శ్రీలత ఆధ్వర్యంలో తుని కొండవారపేట సెక్టార్ అంగన్‌వాడీలు స్థానిక కమ్యూనిటీ హాలులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసీడీపీఓ మాట్లాడుతూ, తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన పోషకాలతో పాటు, సంపూర్ణ ఆహారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రోజువారీ తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాల వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పోతురాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే చిన్నారులకు ఆరోగ్యం

శంఖవరం: తల్లిపాలతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. మంగళవారం స్థానిక సత్యదేవ కళ్యాణ మండపంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ

గోకవరం: తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా వంటివని, బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డ ఎదుగుదలకు తోడ్పడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంజని అన్నారు. మండలంలోని తంటికొండలో తల్లిపాలు వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డ మెదడు చురుకుగా పని చేయడంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ తదితర అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ఏలేశ్వరం: తల్లిపాల వారోత్సవాలు లింగంపర్తి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీ దేవి మాట్లాడుతూ, ప్రతి తల్లి బిడ్డకు ముర్రిపాలను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తల్లిపాలతో ఎటువంటి అనారోగ్యం రాదన్నారు. బిడ్డకు తల్లిపాలకు మించిన మందు లేదన్నారు. అనంతరం సిబ్బంది ర్యాలీ చేశారు.

వైఎస్సార్ సీపీలో యువతకు ప్రాధాన్యం



జగ్గంపేటలో మాజీ మంత్రిని కలిసిన యువకులు

జగ్గంపేట: వైఎస్సార్ సీపీలో యువతకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించనున్నట్లు మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. గోకవరానికి చెందిన యువకులు మంగళవారం ఆయనను జగ్గంపేట పార్టీ కార్యాలయంలో కలిశారు. ఆయన మాట్లాడుతూ, పార్టీ పటిష్టత కోసం కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుందని, పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ జనరల్ సెక్రటరీ తోట రాంజీ, జిల్లా ఉపాధ్యక్షులు రామకుర్తి మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ర్యాలీ

ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పట్టణంలో మంగళవారం కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. సీపీఐఎంఎల్ వినోద్ మిశ్రా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. గణేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే వాటిని అమర్చేందుకు చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. పేదలకు పెనుభారంగా మారనున్న స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ప్రత్తిపాడు: విద్యుత్ వినియోగదారుల ఇళ్లకు ప్రీ పెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దంటూ ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ, అధికారంలోకి రాక ముందు చంద్రబాబు అనేక సమావేశాల్లో ఈ స్మార్ట్ మీటర్ల ద్వారా జగన్ మోహన్‌రెడ్డి భారీ అవినీతికి పాల్పడ్డారని, దీనిని వ్యతిరేకించాలని ఉపన్యాసాలిచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్మార్ట్ మీటర్లు బిగించడంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులు భారీగా పెంచేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రొంగల ఈశ్వరరావు, నిట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: విద్యుత్ చార్జీల నిలువు దోపిడి, ప్రమాదకర ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ప్రజా సంఘాలు స్థానిక సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు మరోమాట మాట్లాడటం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని విమర్శించారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను అమలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈకి వినతపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసు, ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలు నిర్వహించాలి

ప్రత్తిపాడు: వాడవాడలా పంద్రాగస్టు వేడుకలు నిర్వహించాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి కుండల సాయికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులో మంగళవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 10, 11, 12 తేదీల్లో మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, 13న కొవ్వొత్తుల ర్యాలీలు, పాఠశాలలు, కళాశాలల్లో సెమినార్‌లు నిర్వహించడం, 15న మండల కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి నగర పంచాయతీలకు మండల ఇన్‌చార్జులు, మండల కమిటీ అధ్యక్షులను నియమించినట్టు తెలిపారు.

రైతులకు విత్తనాల పంపిణీ

కిర్లంపూడి: రైతులు వరినాట్లు వేసే సమయంలో నారు చివర్లను తుంచి నాట్లు వేయడం వల్ల కాండపు తొలిచే పురుగు రాకుండా అరికట్టవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి సుధామాధురి తెలిపారు. మండల పరిధి కృష్ణవరంలో మంగళవారం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలిసి పొలాల్లోని వరినాట్లు వేసే పద్ధతిని ఆమె పరిశీలించారు. వరినాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గట్లపై వేసుకోవడానికి కంది విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

తుని: ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. సీఐ మాట్లాడుతూ, ఇసుక, మట్టి, గ్రావెల్ ట్రాక్టర్ల డ్రైవర్లు సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. పట్టణంలో డ్రైవర్లు మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు కలిగి ఉండాలని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొక్కలు పెంచాలి

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలను ప్రతిఒక్కరూ విధిగా పెంచాలని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, వైద్యుడు విజయబాబు అన్నారు. లింగంపర్తి గ్రామంలో మంగళవారం సంఘ ఉపాధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు తన కుమారుడు అనసూరి ప్రవీణ్‌సాయి అభిషేక్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ, మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత ఉంటుందన్నారు. వాతావరణ పరిరక్షణలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

మన మిత్రపై అవగాహన ర్యాలీ

గండేపల్లి: వాట్సాప్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీడీఓ (డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి) శ్యామల పిలుపునిచ్చారు. గండేపల్లిలో మంగళవారం మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆమె ముఖ్యఅతిథిగా ర్యాలీలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ చంద్రరావు, పంచాయతీ కార్యదర్శి ఫణీంద్ర, ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ డ్రోన్‌ల పంపిణీ

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం, రౌతులపూడిలో మంజూరైన రైతులకు వ్యవసాయ డ్రోన్‌లను ఏఓ రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభ మంగళవారం పంపిణీ చేశారు. అదే విధంగా స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద కొత్తగా నియమితులైన పీఏసీ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది.